నేటి మ్యాచ్‌లు | వెస్టిండీస్ X ఉగాండా గయానా - ఉ. 6.00 | భారత్ X పాకిస్థాన్ న్యూయార్క్ - రా. 8.00 | ఒమన్ X స్కాట్లాండ్ అంటిగ్వా - రా. 10.30

స్వియాటెక్ హ్యాట్రిక్

వరుసగా మూడో టైటిల్ సొంతం • ఫైనల్లో జాస్మిన్‌పై అలవోక విజయం

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌తో పోలాండ్ భామ ఇగా స్వియాటెక్ ప్రేమాయణం కొనసాగుతున్నది. మట్టికోర్టులో తనకు తిరుగులేదని మరోమారు నిరూపిస్తూ స్వియాటెక్ ముచ్చటగా మూడోసారి ట్రోఫీకి ఫ్రెంచ్ కిస్ ఇచ్చింది. టోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ముందుకుసాగిన స్వియాటెక్..టైటిల్ ఫైట్‌లో ఇటలీ బ్యూటీ జాస్మిన్ పాలినిపై అలవోక విజయం సాధించింది. కోర్టులో పాదరసంలా కదులుతూ వరుస సెట్లలో జాస్మిన్‌ను చిత్తుచేసి గత ఐదేండ్లలో నాలుగోసారి ఫ్రెంచ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుని కొత్త చరిత్ర లిఖించింది.

ప్రైజ్‌మనీ: విజేత: స్వియాటెక్ [21.65 కోట్లు]
రన్నరప్: జాస్మిన్ [10.82 కోట్లు]

జాస్మిన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ టైటిల్ విజేతగా నిలిచింది. ఫేవరెట్ హోదాకు న్యాయం చేస్తూ శనివారం పూర్తి ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో టాప్‌సీడ్ స్వియాటెక్ 6-2, 6-1తో జాస్మిన్ పాలిని(ఇటలీ)పై అద్భుత విజయం సాధించింది. ఫిలిపి చాట్రియర్ స్టేడియం వేదికగా గంటా ఎనిమిది నిమిషాల పాటు సాగిన పోరులో స్వియాటెక్ తనదైన ఆధిపత్యం ప్రదర్శించింది. మట్టికోర్టులో తన అనుభవాన్ని ఉపయోగిస్తూ స్వియాటెక్..వరుస సెట్లలో 12వ సీడ్ జాస్మిన్‌ను చిత్తుచేసింది. స్వియాటెక్ 18 విన్నర్లు కొట్టగా, జాస్మిన్ 7కు పరిమితమైంది. 21 సార్లు అనవసర తప్పిదాలకు పాల్పడటం జాస్మిన్ కొంప ముంచింది.

21 ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్ వరుసగా సాధించిన విజయాలు. ఓపెన్ ఎరాలో ఇది నాలుగో సుదీర్ఘ విజయాల రికార్డు

3 ఫ్రెంచ్ ఓపెన్‌లో స్వియాటెక్(4) కంటే ముగ్గురు ప్లేయర్లు క్రిస్ ఎవర్ట్(7), స్టెఫీగ్రాఫ్ (6), హెనిన్(4) ఎక్కువ టైటిళ్లు సాధించారు.

అన్నుమాలిక్ రజత పట్టు

బుడాపెస్ట్: బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత యువ రెజ్లర్ అన్ను మాలిక్ రజత పతకంతో మెరిసింది. శనివారం జరిగిన మహిళల 57కిలోల ఫైనల్ బౌట్‌లో బరిలోకి దిగిన అన్నుమాలిక్ 1-12 తేడాతో క్జెగ్జిన్‌హాంగ్(చైనా) చేతిలో ఓటమిపాలై రెండో స్థానంలో నిలిచింది. ప్రపంచ నంబర్‌వన్ చైనా రెజ్లర్‌కు మాలిక్ దీటైన పోటీనివ్వడంలో విఫలమైంది. ఆసియాగేమ్స్(హంగ్జు) కాంస్య విజేత అయిన క్జెగ్జిన్‌హాంగ్..మాలిక్‌పై పూర్తిపట్టు సాధిస్తూ బౌట్‌ను తన వశం చేసుకుంది. మరోవైపు మహిళల 53కిలోల విభాగంలో అంతిమ్ పంగల్ 0-4 తేడాతో ఎమ్మాజోనా డెనైస్(స్వీడన్) చేతిలో ఓడి రజత పతకంతో సరిపెట్టుకుంది.

మిల్లర్ ధనాధన్

నెదర్లాండ్స్‌పై దక్షిణాఫ్రికా గెలుపు

మిల్లర్ (59*)

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై దక్షిణాఫ్రికా చెమటోడ్చి గెలిచింది. శనివారం నసావు స్టేడియం వేదికగా జరిగిన గ్రూపు-డి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. డచ్ టీమ్ నిర్దేశించిన 104 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనను 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయిన సఫారీలు 106 పరుగులు చేశారు. 12 పరుగులకే హెండ్రిక్స్(3), డికాక్(0), కెప్టెన్ మార్క్‌రమ్(0), క్లాసెన్(4) వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికాను డేవిడ్ మిల్లర్(51 బంతుల్లో 59 నాటౌట్, 3ఫోర్లు, 4సిక్స్‌లు), స్టబ్స్(33) ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 72 బంతుల్లో 65 పరుగులు జోడించారు. అనూహ్యంగా స్పందిస్తున్న నసావు పిచ్‌పై డచ్ బౌలింగ్ దాడిని సమర్థంగా ఎదుర్కొంటూ మిల్లర్ బాధ్యాతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. బార్ట్‌మన్ (4/11), జాన్సెన్(2/20), నోకియా (2/19) విజృంభణతో నెదర్లాండ్స్ 103/9 స్కోరుకు పరిమితమైంది. సైబ్రాండ్(40), వాన్‌బీక్ (23) ఫర్వాలేదనిపించారు. మిల్లర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

మూడులో ప్రజ్ఞానంద

స్టావెంజర్(నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. శనివారం జరిగిన ఆఖరి రౌండ్‌లో ప్రజ్ఞానంద..హికారు నకమురాపై గెలిచాడు. దీంతో 14.5 పాయింట్లతోమూడో స్థానం దక్కించుకున్నాడు. కార్ల్‌సన్(17.5), నకమురా(15.5) టాప్-2లో నిలిచారు.

భారత్ X పాక్

- దాయాదుల సమరం నేడే
- జోరుమీదున్న టీమ్‌ఇండియా
- ఒత్తిడిలో బాబర్‌సేన

అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. అగ్రరాజ్యం అమెరికా వేదికగా దాయాదులు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడబోతున్నారు. పొట్టి ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై ఘనమైన రికార్డును కొనసాగించేందుకు భారత్ తహతహలాడుతున్నది. ఐర్లాండ్‌పై ఘన విజయంతో టీమ్‌ఇండియా మంచి జోరుమీదుంటే..ఆతిథ్య అమెరికా చేతిలో అనూహ్య ఓటమితో పాక్ ఒత్తిడి ఎదుర్కొంటున్నది. మెగాటోర్నీలో కీలక మ్యాచ్‌గా భావిస్తున్న భారత్, పాక్ పోరులో పైచేయి ఎవరిదో మరికొన్ని గంటల్లో తేలనుంది.

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో బ్లాక్‌బస్టర్ పోరుకు సమయం ఆసన్నమైంది. బేస్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో మునిగితేలే అమెరికా వాసులకు భారత్, పాకిస్థాన్ పోరు అసలైన మజాను అందించనుంది. యుద్ధాన్ని తలపించే మ్యాచ్ కోసం ఇప్పటికే ఇరు దేశాల అభిమానులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. మెగాటోర్నీ కోసం కొత్తగా నిర్మించిన నసావు స్టేడియంలో ఆదివారం భారత్, పాకిస్థాన్ మధ్య కీలక పోరు జరుగనుంది. 34,000 మంది సామర్థ్యం కల్గి ఉన నసావు స్టేడియం దాయాదుల మ్యాచ్‌కు కిక్కిరిసిపోయే అవకాశముంది. టిక్కెట్ల భారీ ధరను కూడా లెక్క చేయకుండా వేల మైళ్ల దూరం ప్రయాణించి తమ అభిమాన క్రికెటర్లను ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

రోహిత్‌సేన జోరు:

టీ20 ప్రపంచకప్‌లో భారత్ జోరుమీద కనిపిస్తున్నది. ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన రోహిత్‌సేన అదే దూకుడుతో పాక్ పనిపట్టాలని చూస్తున్నది. నిలకడలేమికి చిరునామా అయిన పాక్ చెక్ పెట్టేందుకు టీమ్‌ఇండియా అస్త్రశస్త్రాలతో సిద్ధమైంది. ఐర్లాండ్‌తో ఆడిన జట్టునే పాక్‌తో మ్యాచ్‌కు దాదాపు కొనసాగించే అవకాశముంది. అక్షర్‌పటేల్ లేదా జడేజా స్థానంలో స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్ జట్టులోకి తీసుకునే చాన్స్ కనిపిస్తున్నది. రోహిత్, కోహ్లీ ఓపెనర్లుగా రానుండగా, రిషబ్ పంత్ మూడో స్థానం ఫిక్స్ అయ్యింది.

పాక్ పరేషాన్: మెగాటోర్నీలో పాకిస్థాన్‌కు ఆదిలోనే అమెరికా టీమ్ కోలుకోలేని షాక్ ఇచ్చింది. టోర్నీలో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాలంటే పాక్..భారత్‌పై గెలువక తప్పని పరిస్థితి నెలకొన్నది. షాహిన్ అఫ్రిది, హరిస్ రవూఫ్, మహ్మద్ ఆమిర్, యాసిర్ షాతో పాక్ పేస్ దళం బలంగా కనిపిస్తున్నా..భారత్ ఎలా అడ్డుకట్ట వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

పిచ్‌పై రచ్చ: నసావు స్టేడియంలో డ్రాప్ ఇన్ పిచ్‌లపై ఐసీసీ ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌లపై అటు ప్లేయర్లతో పాటు మాజీలు తమదైన శైలిలో తప్పుబడుతున్నారు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో రోహిత్, పంత్‌కు గాయాలు కాగా, పాక్‌తో పోరులో పిచ్ ఎలా స్పందిస్తున్నది అంచనాలకు అందకుండా ఉంది.

జట్ల అంచనా

భారత్: రోహిత్(కెప్టెన్), కోహ్లీ, పంత్,సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్

పాకిస్థాన్: బాబర్(కెప్టెన్), రిజ్వాన్, ఉస్మాన్, జమాన్, ఆజమ్, ఇఫ్తికార్, షాదాబ్/ఆయూబ్, అఫ్రిది, నసీమ్, ఆమిర్, రవూఫ్.

కివీస్ 75 ఆలౌట్

అఫ్గానిస్థాన్ సంచలన విజయం

గుర్బాజ్(80)

జార్జ్‌టౌన్:టీ20 ప్రపంచకప్‌లో అనూహ్య ఫలితాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. పాకిస్థాన్‌కు ఇప్పటికే అమెరికా దిమ్మతిరిగే షాక్ ఇవ్వగా..కసికూన అఫ్గానిస్థాన్..న్యూజిలాండ్ భరతం పట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో అఫ్గన్ 84 పరుగుల తేడాతో కివీస్‌పై భారీ విజయం సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో న్యూజిలాండ్‌పై అఫ్గన్‌కు ఇది తొలి గెలుపు కావడం విశేషం. దీంతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన అఫ్గానిస్థాన్ గ్రూపు-సీలో టాప్‌గేర్‌లో దూసుకెళుతున్నది. తొలుత ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(56 బంతుల్లో 80, 5ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌కు తోడు ఇబ్రహీం జద్రాన్(44) రాణించడంతో అఫ్గన్ నిర్ణీత 20 ఓవర్లలో 159/6 స్కోరు చేసింది. ముఖ్యంగా గుర్బాజ్..కివీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. గుర్బాజ్, జద్రాన్ కలిసి తొలి వికెట్‌కు 103 పరుగులు జోడించారు. అయితే ఆ తర్వాత వచ్చిన నబీ(0), కెప్టెన్ రషీద్‌ఖాన్(6) నయిబ్(0) స్వల్ప స్కోర్లకు పరిమితమయ్యారు. బౌల్ట్(2/22), హెన్రీ (2/37) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన కివీస్..ఫజుల్లా ఫారుఖి (4/17), రషీద్‌ఖాన్(4/17) విజృంభణతో 15.2 ఓవర్లలోనే కివీస్ 75 పరుగులకు కుప్పకూలింది. ఫిలిప్స్ (18), హెన్రీ(12) మినహా అందరూ సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యారు.

బంగ్లా భళా

శ్రీలంకపై ఉత్కంఠ విజయం

రిషాద్(3/22)

డల్లాస్: టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ అదిరిపోయే బోణీ కొట్టింది. శనివారం జరిగిన గ్రూపు-డి మ్యాచ్‌లో శ్రీలంకపై 2 వికెట్ల తేడాతో బంగ్లా ఉత్కంఠ విజయం సాధించింది. లంక నిర్దేశించిన 125 పరుగుల లక్ష్యఛేదనలో 8 వికెట్లు కోల్పోయిన బంగ్లా 19వ ఓవర్లో విజయాన్నందుకుంది. నువాన్ తుషార(4/18), హసరంగ(2/32) ధాటికి ఒక దశలో ఓటమి కోరల్లో చిక్కుకున్న బంగ్లాను తౌహిద్ హృదయ్(40), లిటన్ దాస్(36) ఆదుకున్నారు. మొదట 6 పరుగులకే తంజిద్ హసన్(3), సౌమ్యసర్కార్(0), కెప్టెన్ నజ్ముల్(7) వికెట్లు కోల్పోయిన బంగ్లా తౌహిద్, లిటన్ గట్టెక్కించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 38 బంతుల్లో 63 పరుగులు జోడించారు. అయితే 22 పరుగుల తేడాతో బంగ్లా ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో మహ్మదుల్లా జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. అంతకుముందు నిస్సనక(47), డిసిల్వా(21) రాణించడంతో లంక 20 ఓవర్లలో 124/9 స్కోరు చేసింది. ముస్తాఫిజుర్(3/17), రిషాద్ హుస్సేన్ (3/22) విజృంభణతో లంక వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. కుశాల్‌మెండిస్(4), కెప్టెన్ హసరంగ(0) ఘోరంగా విఫలమయ్యారు. మూడు వికెట్లు పడగొట్టిన రిషాద్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

విలువలే వెండితెర ఉషాకిరణాలు

అక్షర యోధుడు అనంతలోకాలకు చేరాడు. ఉషాకిరణాలను వెండితెరపై ప్రసరింపజేసిన కళాభానుడు అస్తమించాడు.. వేలాదిమందిలో స్ఫూర్తిని నింపిన సృజనమూర్తి పవిత్రాత్మగా మారాడు.. రొడ్డకొట్టుడు విధానాలను సంస్కరించి, అడుగుపెట్టిన అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలికి.. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమందికి ఉపాధినిచ్చిన దార్శనికుడు.. పత్రికాధిపతి.. వ్యాపారదిగ్గజం, సినీ నిర్మాత, రామోజీ ఫిల్మ్‌సిటీ అధినేత, పంపిణీదారుడు, పద్మవిభూషణుడు.. చెరుకూరి రామోజీరావు మహాభినిష్క్రమణం చెందారు.

సినిమాలంటే రామోజీరావుకి ప్రత్యేకమైన అభిమానం. ఆ ఇష్టంతోనే ఉషాకిరణ్‌మూవీస్‌ని స్థాపించారాయన. తొలి ప్రయత్నంగా 'శ్రీవారికి ప్రేమలేఖ'(1984) తీశారు. నరేశ్, పూర్ణిమ జంటగా జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం.. తెలుగునాట నవ్వుల వర్షం, రామోజీరావుకు కాసుల వర్షం కురిపించింది. అదే ఏడాది ఆయన ప్రొడక్షన్ నుంచి వచ్చిన మరో అద్భుతం 'మయూరి'. నృత్యకళాకారిణి సుధాచంద్రన్ జీవితానికి తెరరూపాన్నిస్తూ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా అందుకోని గౌరవం లేదు. ఇక అక్కడ్నుంచి నిర్మాతగా వెనుదిరిగి చూసుకోలేదు రామోజీరావు. అలాగే విలువలను కూడా వదులుకోలేదు. ఉషాకిరణ్ మూవీస్ సంస్థ నుంచి సినిమా వస్తుందంటే.. అది కచ్చితంగా గొప్ప సినిమానే అయ్యుంటుందనే అభిప్రాయం ప్రేక్షకుల్లో కలిగేలా అద్భుతమైన సినిమాలను నిర్మించారు రామోజీరావు. ఆ కోవకు చెందిన సినిమానే టి.కృష్ణ 'ప్రతిఘటన'(1985). రౌడీ రాజకీయాలపై ఓ ఉపాధ్యాయురాలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన ఆ సినిమా ఆ రోజుల్లో పెను సంచలనం. దర్శకుడిగా టి.కృష్ణనీ, హీరోయిన్‌గా విజయశాంతిని అగ్రపథాన నిలబెట్టిందీ సినిమా. ఆ ఏడాది అవార్డులపరంగా, రివార్డుల పరంగా తిరుగులేని సినిమాగా నిలిచింది. అంతేకాక, తమిళం, హిందీ భాషల్లో కూడా విడుదలై విజయాలను అందుకున్నది.

ఉషాకిరణ్‌లో మెరిసిన తారలు

- రామోజీ పరిచయం చేసిన సినీ దిగ్గజాలు కేరక్టర్ నటుడిగా ఉన్న రాజేంద్రప్రసాద్ 'ప్రేమించు పెళ్లాడు'తో హీరోగా మారారు. 'ప్రతిఘటన'తో చరణ్‌రాజ్, కోటశ్రీనివాసరావు బిజీ విలన్లుగా అవతరించారు. 'మౌనపోరాటం'తో వినోద్‌కుమార్, యమున హీరోహీరోయిన్లుగా పరిచయం అయ్యారు. నటుడు శ్రీకాంత్ తొలి సినిమా 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'. సంగీత దర్శకుడిగా ఎం.ఎం.కీరవాణికీ.. బాలనటులుగా తరుణ్, సునయనల తొలి సినిమా 'మనసు-మమత'. దర్శకుడిగా తేజ తొలి సినిమా 'చిత్రం'. ఈ సినిమాతోనే ఉదయ్ కిరణ్, రీమాసేన్ హీరోహీరోయిన్లు పరిచయం అయ్యారు. 'నిన్ను చూడాలని' సినిమాతో జూనియర్ ఎన్టీయార్ హీరోగా తెరంగేట్రం చేయగా, 'తొలి చూపులోనే' సినిమాతో నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా తెరకు పరిచయం అయ్యారు. 'నచ్చావులే' సినిమాతో తనీష్, మాధవీలత హీరోహీరోయిన్లుగా మారారు. ఇవన్నీ రామోజీరావు నిర్మించిన సినిమాలే. శ్రియ, జెనిలియా సైతం ఉషాకిరణ్ ద్వారా పరిచయమైన తారలే.

రామోజీ అందుకున్న అవార్డులు

- నిర్మాతగా రామోజీ అందుకున్న అవార్డులు 1985 అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలతోపాటు 2014లో జరిగిన అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో కూడా రామోజీరావు నిర్మించిన 'మయూరి' సినిమా ప్రదర్శించబడటం విశేషం. ఏకంగా 14 నంది అవార్డులు గెలుచుకున్న ఏకైక సినిమాగా చెరగని రికార్డును సొంతం చేసుకుంది 'మయూరి'. ఈ చిత్రానికి జాతీయ అవార్డు కూడా దక్కింది. టి.కృష్ణ 'ప్రతిఘటన' సినిమా ఆరు నంది అవార్డులు, రెండు ఫిల్మ్ ఫేర్ అవార్డులను గెలుకుంది.
- ఇక మౌళీ దర్శకత్వంలో రూపొందిన 'అశ్విని' సినిమా అయితే.. గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడటమేకాక, 1991వ సంవత్సరానికిగాను ఉత్తమ తృతీయ చిత్రంగా నంది అవార్డును కూడా గెలుగుచుకుంది.
- వీటితోపాటు కాంచనగంగ, మనసు-మమత ఈ చిత్రాలు కూడా అవార్డులు రివార్డులు పొందిన సినిమాలే.

సినిమా జర్నలిజానికి ఊతం

సినిమాపై ఇష్టంతో తన సొంత పత్రిక ఈనాడులో ప్రత్యేకంగా సినిమాకు ఓ పేజీని కేటాయించారు రామోజీరావు. ఈ పద్ధతిని తర్వాత అన్ని పత్రికలూ అవలంబించాయి. 'సితార' పేరుతో రామోజీరావు సినీ పత్రిక వార పత్రికను నడిపారు.

ఇంకొన్ని విజయాలు..

- ఉషాకిరణ్ మూవీస్ నుంచి వచ్చిన మరో అద్భుతం 'చిత్రం'(2000). అందరూ కొత్త వాళ్లతో అతి తక్కువ బడ్జెట్‌తో రామోజీరావు నిర్మించిన ఈ సినిమా వాణిజ్యపరంగా భారీ విజయాన్ని అందుకున్నది.
- ఇవిగాక, కాంచనగంగ, కారు దిద్దిన కాపురం, ఓ భార్యకథ, పైలాపచ్చీస్, అమ్మ, డాడీ డాడీ, ఆనందం, నచ్చావులే.. ఎన్నో ప్రజాదరణ పొందిన చిత్రాలను నిర్మించి, అగ్ర నిర్మాతగా తనదైన ముద్ర వేశారు రామోజీరావు. నిర్మాతగా దాదాపుగా 89 సినిమాలు నిర్మించిన ఘనత రామోజీరావుది.

రామోజీ సినిమా వ్యాపారం

పంపిణీదారుడిగా, ఎగ్జిబిటర్‌గా కూడా తనదైన ముద్ర వేశారు రామోజీ. ఇక రామోజీ ఫిల్మ్‌సిటీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కవే. ఇది దేశానికే కాదు, ఆసియా ఖండానికే గర్వ కారణం. ఇలా సినీరంగానికి రామోజీరావు చేసిన సేవ సామాన్యమైనది కాదు. రామోజీరావు మరణం సినీ రంగానికి నిజంగా తీరని లోటు.

బయోపిక్స్‌తో సంచలనం

- తెలుగు చిత్రసీమలో ఎక్కువ బయోపిక్‌లు నిర్మించిన నిర్మాత రామోజీరావు. ఆయన ప్రొడక్షన్ నుంచి మూడు బయోపిక్‌లు వచ్చాయి. అవే మయూరి, మౌనపోరాటం, అశ్విని. వీటిల్లో మమూరి, అశ్విని చిత్రాలకు ఓ ప్రత్యేకత ఉంది.
- నృత్యకారిణి సుధాచంద్రన్ బయోపిక్‌గా 'మయూరి' చిత్రాన్ని నిర్మించి.. అందులో సుధాచంద్రన్ పాత్రను సుధాచంద్రన్ చేతే చేయించడం ఓ విశేషమైతే.. పరుగులరాణి అశ్వనినాచప్ప జీవిత కథకు తెరరూపంగా 'అశ్వని' చిత్రాన్ని నిర్మించి, ఇందులో అశ్వని నాచప్ప పాత్రను అశ్వనినాచప్ప చేతే నటింపజేయడం మరో విశేషం. ఎవరి కథలకైతే తెరరూపాన్నిస్తున్నారో, వారినే కథానాయికలుగా పెట్టి సినిమాలు తీసిన నిర్మాతగా చరిత్ర సృష్టించారు రామోజీరావు. ఇది ఆయనకు మాత్రమే దక్కిన రికార్డ్.
- *మౌళి దర్శకత్వంలో వచ్చిన 'అశ్విని'(1991) సినిమా పిల్లల్లో క్రీడలపట్ల అసక్తిని రెట్టింపు చేసింది. వాణిజ్యపరంగా కూడా అమోఘ విజయాన్ని అందుకుంది.*
- *రామోజీరావు నిర్మించిన మరో బయోపిక్ 'మౌనపోరాటం'(1989). నమ్మించి మోసగించి, గర్భవతిని చేసి వదిలేసిన ఓ కామాంధుడిపై ఓ ఆదివాసీ మహిళ చేసిన న్యాయ పోరాటమే ఈ 'మౌనపోరాటం'. సబిత అనే ఓ అదివాసీ మహిళ జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి స్త్రీలు బ్రహ్మరథం పట్టారు.*

చిత్రం

రామోజీ(గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న అగ్ర హీరోలు చిరంజీవి, పవన్‌కల్యాణ్, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి.

రామోజీరావుగారు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. వినోదభరితమైన కార్యక్రమాలకు మార్గదర్శిలా నిలిచారు. ఆయన నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా, ఎగ్జిబిటర్‌గా మరియు స్టూడియో యజమానిగా పరిశ్రమకు విశేషమైన సేవలందించారు. ఎందరో నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులను పరిశ్రమకు పరిచయం చేశారు. తెలుగువారందరూ ఆయన సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకుంటారు.

-తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి

భారతీయ చలన చిత్ర పరిశ్రమ, మీడియా, వినోదరంగాలకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాం.

-తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్

నేడు సినిమా షూటింగ్స్ బంద్

రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతికి సంతాప సూచకంగా ఆదివారం సినిమా షూటింగ్స్ బంద్ చేయబోతున్నట్లు తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు శనివారం ఫిల్మ్‌సిటీలో రామోజీరావు పార్థివ దేహానికి మోహన్‌బాబు, రాఘవేంద్రరావు, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, నరేష్, కల్యాణ్‌రామ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు నివాళులర్పించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.